
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
ఆదివారం 21 జనవరి 2024



పోలింగ్ కేంద్రాల్లో పనులు పూర్తిచేయాలి

● ఇన్‌చార్జి కలెక్టర్ నవీన్

కలెక్టరేట్, జనవరి 20: జిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో పెండింగ్ పనులను ఈ నెలాఖరులోగా పూర్తిచేయాల్సిందేనని ఇన్‌చార్జి కలెక్టర్ ఎం.నవీన్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల్లో నీటివసతి, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యాలు, భవనాల మరమ్మతులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. దివ్యాంగుల కోసం 360చోట్ల ర్యాంపులు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. సమావేశంలో సమగ్రశిక్ష ఏపీసీ రోణంకి జయప్రకాష్, ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ, డీఈవో వేంకటేశ్వరరావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

మావల్ల కానేకాదు

● 56 శాతం మాత్రమే ప్రభుత్వ భవనాలు పూర్తి
● 2019 నాటి ధరలతో పోల్చితే భారీగా పెరిగిన వ్యయం
● బిల్లుల మంజూరులోనూ ఆలస్యం చేస్తున్న ప్రభుత్వం
● నష్టాన్ని భరించలేమంటూ చేతులెత్తేస్తున్న వైసీపీ నాయకులు



గార : శాలిహుండంలో శ్లాబువేసి నిలిచిన సచివాలయ నిర్మాణం



సరుబుజ్జిలి : చిగురువలసలో అసంపూర్తిగా సచివాలయ భవనం

ప్రభుత్వ భవనాల నిర్మాణాలు కొనసాగుతూనే ఉన్నాయి. పంచాయతీల్లో ప్రభుత్వ భవనాల నిర్మాణం కాంట్రాక్టు చేపడితే.. ప్రజల్లో గౌరవంతోపాటు డబ్బులు కూడా కాస్త మిగిలే అవకాశం ఉంటుందని అధికారపార్టీ మద్దతుదారులైన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు భావించారు. కానీ వారి ఆశలు అడియాశలై నష్టాలను చవిచూస్తున్నారు. ప్రభుత్వం 2019 నాటి ధరల ఆధారంగా నిధులు మంజూరు చేయగా.. ప్రస్తుతం నిర్మాణసామగ్రి వ్యయం పెరగడంతో పనులు చేపట్టడం తమ వల్ల కాదంటూ కొంతమంది చేతులెత్తేస్తున్నారు. బిల్లులు కూడా సకాలంలో మంజూరు కాకపోవడంతో నష్టాన్ని తాము భరించలేమంటూ స్పష్టం చేస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

వైసీపీ అధికారంలోకి వచ్చాక గ్రామ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. సొంత భవనాలు ఉండేలా ఉపాధిహామీ నిధులు మంజూరుచేసింది. ఇందులో భాగంగా అధికారపార్టీకి చెందిన గ్రామస్థాయి నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు.. ఆయా పంచాయతీల్లో ప్రభుత్వ భవనాల నిర్మాణాన్ని ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీల ద్వారా తీసుకుని పనులు ప్రారంభించారు. ప్రభుత్వ తీరుతో ఇప్పుడు ఎందుకు చేపట్టామా? అంటూ ఈసురోమంటున్నారు. జిల్లాలో 602 సచివాలయ భవనాలు, 495 రైతు భరోసా కేంద్రాలు, 357 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు.. మొత్తం 1,454 భవనాలు మంజూరయ్యాయి. ఇందుకుగాను సుమారు రూ.475 కోట్లు కేటాయించారు. రెండున్నరేళ్ల నుంచి భవనాల నిర్మాణం చేపడుతున్నా ప్రగతి అంతంతమాత్రంగానే ఉంది. ఎన్నికల కాలం సమీపిస్తుండడంతో.. ప్రభుత్వ ప్రాధాన్యం అంటూ అధికారులు కాంట్రాక్టర్లపై ఒత్తిడి చేసినా ఇప్పటివరకూ 827 భవనాలు (56శాతం) మాత్రమే పూర్తయ్యాయి. సుమారు రూ.210కోట్ల వరకు బిల్లులు చెల్లించారు. చేపట్టిన పనులకు సంబంధించి రూ.18కోట్ల మేర బిల్లులు పెండింగ్ ఉన్నాయి. సకాలంలో బిల్లులు అందక.. పనులు పూర్తిచేయలేక స్థానిక అధికారపార్టీ నేతలు ఉసూరుమంటున్నారు. వివిధ దశల్లో ఉన్న 627 భవనాలు(44 శాతం) ఎప్పటికి పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఎన్నికలు ముగిశాక.. అప్పటి పరిస్థితి ఏమిటో అని అయోమయం చెందుతున్నారు. గత ప్రభుత్వంలో చేపట్టిన 'నీరు-చెట్టు' పనులకు సంబంధించిన బిల్లుల కోసం కోర్టుల చుట్టూ తిరుగుతున్నారంటూ కాంట్రాక్టర్లు ఆవేదన చెందుతున్నారు.

● ధరల్లో భారీ వ్యత్యాసం

వైసీపీ ప్రభుత్వం 2019లో అప్పటి ధరలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. ఈ నాలుగేళ్లలో నిర్మాణ సామగ్రి ధరలు బాగా పెరిగాయని.. అప్పటి ధరలతో పోల్చితే భారీ వ్యత్యాసం ఉందని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. 2019లో సిమెంట్ బస్తా రూ.175, మూడు యూనిట్ల చిప్స్ (టిప్పర్ లారీ)రూ.4500, ఇసుక ట్రాక్టర్ రూ.1500, ఐరన్ టన్ను రూ.37,000, ఒక్కొక్కరికి రోజు కూలి రూ.300, మేస్త్రికి రోజుకూలీ రూ.400 ఉండేది. కరోనా వ్యాప్తి తర్వాత రేట్లు భారీగా పెరిగిపోయాయి. ప్రస్తుతం సిమెంట్ బస్తా రూ.420, మూడు యూనిట్ల చిప్స్ రూ. 15వేలు, ఇసుక రూ.5వేలు, ఐరన్ టన్ను రూ.82వేలు, రోజు కూలీ రూ.600, మేస్త్రికి రోజు కూలీ రూ.800 నుంచి రూ.వెయ్యి వరకు ఖర్చుచేయాల్సి వస్తోంది. భారీ వ్యత్యాసంతో.. కనీసం మూడోవంతు నష్టాన్ని ఎదుర్కోవాల్సి వస్తోందని కాంట్రాక్టర్లు పేర్కొంటున్నారు. దీనికితోడు సకాలంలో బిల్లులు చెల్లించడం లేదని మదనపడుతున్నారు. ఎన్నికల అనంతరం ప్రభుత్వం మారితే బిల్లుల విషయంలో తమ పరిస్థితి ఏంటని కలవరపడుతున్నారు. ఈ క్రమంలో పనులు పూర్తిచేసేందుకు ఆసక్తి చూపడం లేదు. కాగా.. అధికార పార్టీకి రాబోయే ఎన్నికల్లో ఈ పరిణామం ఇబ్బందికరంగా మారనుంది. దీనిపై ఎమ్మెల్యేలు, మంత్రులు సైతం నోరువిప్పలేని పరిస్థితి నెలకొంది.



జలుమూరు: మర్రివలసలో పునాదిస్థాయిలోనే నిలిచిన ఆరోగ్య ఉపకేంద్రం భవనం పనులు

జిల్లాలో ప్రభుత్వ భవనాల ప్రగతి

మండలం	సచివాలయాలు	రైతు భరోసా కేంద్రాలు	విలేజ్‌హెల్త్ క్లినిక్‌లు	ప్రభుత్వానికి అప్పగించినవి	నిర్మాణ దశలో ఉన్నవి
ఆమదాలవలస	15	11	7	12	21
బూర్జ	15	12	7	17	17
ఎచ్చెర్ల	26	14	17	35	22
జి.సిగడాం	21	20	16	44	13
గార	25	16	15	31	25
హిరమండలం	13	13	6	27	5
ఇచ్ఛాపురం	16	16	11	13	30
జలుమూరు	18	18	12	35	13
కంచిలి	21	12	10	22	21
కవిటి	21	12	9	19	23
కోటబొమ్మాళి	24	20	16	26	34
కొత్తూరు	26	25	13	51	13
లావేరు	21	16	10	26	21
ఎల్.ఎన్.పేట	12	10	7	23	6
మందస	29	29	18	41	35
మెళియాపుట్టి	18	16	8	20	22
నందిగాం	19	18	8	24	21
నరసన్నపేట	23	23	19	47	18
పలాస	14	10	9	18	15
పాతపట్నం	18	18	7	28	15
పోలాకి	20	16	14	35	15
పొందూరు	25	8	7	10	30
రణస్థలం	25	15	16	33	23
సంతబొమ్మాళి	17	18	12	23	24
సారవకోట	20	17	13	30	20
సరుబుజ్జిలి	12	12	7	22	9
సోంపేట	21	19	15	27	28
శ్రీకాకుళం	27	22	18	38	29
టెక్కలి	17	18	13	23	25
వజ్రపుకొత్తూరు	23	21	17	29	32
మొత్తం	602	495	357	827	627



నరసన్నపేటలో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు

ప్రశాంతంగా నవోదయ పరీక్ష

● జిల్లాలో 1,260 మంది విద్యార్థులు గైర్హాజరు

నరసన్నపేట/సరుబుజ్జిలి, జనవరి 20: జవహర్ నవోదయ పాఠశాలలో ఆరోతరగతి ప్రవేశానికి శనివారం నిర్వహించే పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. సరుబుజ్జిలి మండలం వెన్నెలవలసలోని నవోదయ పాఠశాలలో ఆరో తరగతిలో(2024-25 విద్యా సంవత్సరం) చేరేందుకు 80 సీట్లు ఉన్నాయి. వీటికి సంబంధించి ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో 34 కేంద్రాల్లో ప్రవేశ పరీక్షలు నిర్వహించగా 8,430 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 7,170 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 1,260 మంది గైర్హాజరయ్యారు. జిల్లాలో ముగ్గురు ప్రత్యేకాధికారులు పరీక్షలను పర్యవేక్షించారు. నరసన్నపేటలో మూడు కేంద్రాల్లో 577మంది విద్యార్థులకుగానూ 486మంది హాజరయ్యారు. నరసన్నపేటలో కేంద్రాలను జిల్లా ప్రత్యేకాధికారి ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు పరిశీలించారు. అలాగే ఎంఈవోలు ఉప్పాడ శాంతారావు, పి.దాలినాయుడు, హెచ్‌ఎంలు పైడి వెంకటరావు, పాదర్‌టోమి, రమేష్ పర్యవేక్షించారు. ప్రవేశ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించామని వెన్నెలవలస నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ డి.పరశురామయ్య తెలిపారు.

అడ్డంకులు.. అరెస్టులు

● అంగన్‌వాడీల ఉద్యమంపై పోలీసుల నిర్బంధం
● ఉద్యోగులకు మద్దతుగా కార్మిక సంఘాల రాస్తారోకో

అరసవల్లి, జనవరి 20: న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మెకు మద్దతుగా శనివారం శ్రీకాకుళంలోని డే అండ్ నైట్ బ్రిడ్జి వద్ద కార్మిక, ప్రజా సంఘాలు నిర్వహించిన రాస్తారోకో ఉద్రిక్తంగా మారింది. అరెస్టులకు దారి తీసింది. 40 రోజులుగా అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో కార్మిక, ప్రజాసంఘాలు రాస్తారోకోకు పిలుపునిచ్చాయి. కానీ అప్పటికే అక్కడ మోహరించిన పోలీసులు రాస్తారోకోలో పాల్గొన్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి షణ్ముఖరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ కె.నాగమణి, ఐద్వా జిల్లా కన్వీనర్ లక్ష్మితోపాటు 13 మందిని అరెస్టు చేసి రెండో పట్టణ పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా కార్మిక, ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ పండగ రోజుల్లో కూడా అంగన్‌వాడీలు పోరాడుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. ఎస్మాను అమలు చేసి సమ్మెను నిషేధించడం ప్రభుత్వ నియంతృత్వ పోకడలకు నిదర్శనమని తెలిపారు. ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమన్నారు. ఇప్పటికైనా అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

● కలెక్టరేట్ సమీపంలోని జ్యోతిబాపూలే పార్కు వద్ద నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.కల్యాణి మాట్లాడుతూ.. సీఎం జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరితే.. తప్పా? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అంగన్‌వాడీలపై బెదిరింపులు ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు డి.జ్యోతి, డి.ముత్యాలమ్మ, కె.పార్వతి, కె.లక్ష్మి, సూర్యకుమారి, అప్పలనరసమ్మ, అంజలీబాయి, మల్లేశ్వరి, లక్ష్మి, సీఐటీయూ, ఏఐటీయూసీ, రైతు సంఘం, ఐద్వా, యూటీఎఫ్, డీహెచ్‌పీఎస్, ఎస్ఎఫ్ఐ, కళాసీ సంఘం, ఎన్ఎసీఎల్, భవన నిర్మాణ సంఘం, బీఎస్ఎన్ఎల్ సంఘాల నాయకులు పాల్గొన్నారు.





వినూత్న నిరసన

ఎచ్చెర్ల: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎచ్చెర్లలో అంగన్‌వాడీ కార్యకర్తలు శనివారం వినూత్న నిరసన తెలిపారు. సమ్మె 40వ రోజుకు చేరడంతో.. 40 అంకె ఆకారంలో కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.





కార్మిక, ప్రజాసంఘాల నాయకులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో బదిలీలు

శ్రీకాకుళం క్రైం: రానున్న ఎన్నికల నేపథ్యంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖలో బదిలీలు జరిగాయి. విశాఖ జోన్ పరిధిలో ఉన్న 65మంది ఈఎస్ఐలు, 46 మంది ఈఐలకు స్థానచలనం చేస్తూ డిప్యూటీ కమిషనర్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. మహరాణిపేట ఎస్ఈబీ ఈఎస్ఐ ఎల్.మాధవికి శ్రీకాకుళం ఎస్ఈబీకి, విశాఖ డీటీఎఫ్ కె.అనిల్‌కుమార్‌ను ఇచ్ఛాపురం ఎస్ఈబీకి, యలమంచిలి నుంచి కేవీఎస్ గణేష్‌ను టెక్కలి, గోలుగొండ ఈఎస్ఐ పీవీ గిరిబాబును, అరకులో పని చేస్తున్న రమణరావును పలాసకు, సబ్బవరం నుంచి బి.శ్రీనివాసరావును పాతపట్నానికి, అనకాపల్లి నుంచి జానకి కావ్యను నరసన్నపేటకు బదిలీ చేశారు. పాడేరు నుంచి చిన్నవీర్రాజును శ్రీకాకుళం డీటీఎఫ్‌కు, విజయనగరం నుంచి కరుణలతను ఆమదాలవలసకు, నెలిమర్లలో ఉన్న నాగలక్ష్మిను, కూనేరు చెక్‌పోస్టులో ఉన్న రవిప్రసాద్‌ను రణస్థలానికి, కొత్తవలసలో ఉన్న పి.నరేంద్రకుమార్‌ను ఇచ్ఛాపురం బీఎంపీపీకి, సాలూరులో ఉన్న నాగేశ్వరరావును పాతపట్నానికి బదిలీ చేశారు. పార్వతీపురంలో ఉన్న శ్యామిలాను శ్రీకాకుళం డీటీడబ్ల్యూ/సీఆర్‌కి బదిలీ చేశారు. పార్వతీపురం ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టరు ఎంవీ గోపాలకృష్ణను శ్రీకాకుళానికి, గజపతినగరంలో ఉన్న ఎం.విజయలక్ష్మిని రణస్థలం, నెలిమర్లలో ఉన్నరాజశేఖర నాయుడును టెక్కలి, అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఉన్న గాయత్రిని కోటబొమ్మాళి, అరకులో ఉన్న గణపతిబాబును పాతపట్నం, పాడేరులో ఉన్న జె.కూర్మారావును శ్రీకాకుళం ఇంటెలిజెన్స్‌కు బదిలీ చేశారు. కాగా శ్రీకాకుళం టూటౌన్ పప్పల శ్రీనివాసరావును విశాఖపట్నంలోని మహరాణిపేట పోలీసు స్టేషన్‌కు బదిలీ చేశారు.

అన్నీ గొప్పలేనా జగనన్నా!

● సున్నాలేశారు.. మరమ్మతు మాత్రం మరిచారు
● శిథిలావస్థలో ఫాజుల్‌భాగ్‌పేట యూపీహెచ్‌సీ
● జిల్లా కేంద్రంలోని ఆసుపత్రిలోనూ ఇదే దుస్థితి
● భయాందోళనలో రోగులు, వైద్యులు

(శ్రీకాకుళం అర్బన్)

విద్య వైద్యానికి పెద్దపీట వేస్తున్నామని సీఎం జగన్మోహన్‌రెడ్డి గొప్పలు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. 'నాడు-నేడు'లో భాగంగా పాఠశాలలు, ఆస్పత్రుల రూపురేఖలు మార్చేశామని ప్రగల్భాలు పలుకుతున్నా.. శిథిల భవనాలే దర్శనమిస్తున్నాయి. పాత గోడలకు సున్నాలు వేసి వదిలేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కనీసస్థాయిలో మరమ్మతులు చేపట్టడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. వివరాల్లోకి వెళితే.. శ్రీకాకుళంలోని ఫాజుల్‌భాగ్‌పేట, పుణ్యపువీధిలో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు(యూపీహెచ్‌సీ) శిథిలావస్థకు చేరుకున్నాయి. గోడలు పెచ్చులూడి రోగులు, వైద్యులపై పడుతున్నాయి. నాలుగేళ్ల కిందట ఫాజుల్‌భాగ్‌పేట యూపీహెచ్‌సీ గోడలు కూలిపోయినా ఇంతవరకూ వాటి నిర్మాణ పనులు చేపట్టలేదు. కూలిన గోడకు ఆనుకుని విద్యుత్ స్తంభం ఉండడంతో.. అది ఎప్పుడు.. ఎవరిమీద పడి.. ఏ ప్రమాదం జరుగుతుందోనని వైద్యసిబ్బంది భయాందోళన చెందుతున్నారు. గోడ కూలిపోవడంతో పశువులు చొరబడిపోతున్నాయి. రాత్రివేళ కొందరు యూపీహెచ్‌సీలో మద్యం సేవిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఇక్కడ మరుగుదొడ్లు కూడా శిథిలావస్థకు చేరుకోవడంతో మహిళ వైద్యులతో పాటు, యూరిన్ పరీక్షలకు వచ్చే రోగులు అవస్థలు పడుతున్నారు. మూడేళ్ల కిందట మోటారు పాడవడంతో తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండు నెలల కిందట రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల అభివృద్ధికి చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఫాజుల్‌భాగ్‌పేట యూపీహెచ్‌సీకి ముందు గోడలకు రంగు లేశారు. కానీ మరమ్మతులను విస్మరించారు. యూపీహెచ్‌సీ అభివృద్ధికి ఏడాదిగా నిధులు విడుదల చేయడం లేదు. పారిశుధ్య నిర్వహణ బిల్లులు కూడా చెల్లించడం లేదు. పారిశుధ్య సిబ్బందిని కూడా భర్తీ చేయకపోవడంతో యూపీహెచ్‌సీ అధ్వానంగా ఉంది. పుణ్యపువీధిలోని యూపీహెచ్‌సీది అదే పరిస్థితి. 'నాడు-నేడు'లో భాగంగా యూపీహెచ్‌సీలు అభివృద్ధి చేయాలని వైద్యులు అర్జీ చేసుకున్నా అధికారులు స్పందించకపోవడం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి యూపీహెచ్‌సీల అభివృద్ధికి కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



ఫాజుల్‌భాగ్‌పేట యూపీహెచ్‌సీకి ముందు గోడకు సున్నం వేసి వెనుక గోడకు మరమ్మతులు చేయని వైనం

చట్టాలపై అవగాహన ఉండాలి

● జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం అర్బన్, జనవరి 20: మారుతున్న చట్టాలపై దర్యాప్తు అధికారులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా సూచించారు. శ్రీకాకుళంలో జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఎస్పీ జీఆర్ రాధిక అధ్యక్షతన ద్వితీయ అర్ధ వార్షిక నేర సమీక్ష నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా న్యాయాధికారి జేఏ మౌలానా హాజరై మాట్లాడారు. కేసు నమోదు, ఎఫ్ఐఆర్, రిమాండ్, ప్రాపర్టీ సీజ్, ముద్దాయిల అరెస్టు, చార్జిషీట్ దాఖలు వంటి అంశాలపై ఎదురయ్యే లీగల్ సమస్యలపై పబ్లిక్ ప్రాసిక్యూటర్ ద్వారా మా దృష్టికి తీసుకువస్తే పరిష్కార చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎస్పీ రాధిక మాట్లాడుతూ 'రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నాం. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేయాలి. సైబర్ నేరాలపై, 1930 టోల్‌ఫ్రీ నెంబరుపై గ్రామీణ స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలి. రాత్రి గస్తీలను పటిష్ఠం చేసి అనుమానిత వ్యక్తులపై నిఘా ఉంచాలి. రానున్న ఎన్నికల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తతతో ఉండాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో పర్యటించాలి. రాత్రి బస చేసి ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకోవాలి. చెక్‌పోస్టుల వద్ద ముమ్మర తనిఖీలు చేయాలి. సెబ్‌తో సంయుక్తంగా దాడులు చేపట్టాల'ని సూచించారు. సమావేశంలో జిల్లా లీగల్ సెల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, ఏఎస్పీలు టీపీ విఠలేశ్వరరావు, జె.తిప్పేస్వామి, డీఎస్పీలు బాల చంద్రారెడ్డి, శృతి, నాగేశ్వరరెడ్డి, విజయ్‌కుమార్, వాసుదేవ్, సీహెచ్‌జీవీ ప్రసాద్, ట్రైనీ డీఎస్పీ రాజు పాల్గొన్నారు.

మార్చి 9న జాతీయ లోక్ అదాలత్

అరసవల్లి: జాతీయ లోక్ అదాలత్ మార్చి 9న నిర్వహిస్తున్నట్టు జిల్లా న్యాయాధికారి, న్యాయసేవాధికార సంస్థ జిల్లా అధ్యక్షులు జేఏ మౌలానా అన్నారు. ఈ మేరకు జిల్లాలోని పోలీసు, ఎక్సైజ్ లేబర్, విద్యుత్తు, రెవెన్యూ అధికారులతోపాటు హెడ్‌క్వార్టర్స్‌లో న్యాయాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసు అధికారులు ఇప్పటి నుంచే అన్ని చర్యలు తీసుకుని ఎక్కువ కేసులను రాజీ చేయడానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయాధికారులు శ్రీదేవి, భాస్కరరావు, మహేంద్ర, ఫణికుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా, పక్కన ఎస్పీ రాధిక

టీడీపీతోనే బీసీలకు రక్షణ




మెళియాపుట్టి, హిరమండలం మండలాల్లో టీడీపీలో చేరిన వారితో ఎంపీ రామ్మోహన్ నాయుడు, మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ

● ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు

మెళియాపుట్టి, జనవరి 20: టీడీపీతోనే బీసీలకు రక్షణ కలుగుతుందని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శనివారం మెళియాపుట్టిలో 'జయహో బీసీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత అన్యాయాన్ని ఎదిరించిన బీసీలపై అక్రమంగా కేసులు పెట్టి వేధించారని ఆరోపించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత బీసీ రక్షణ చట్టం తీసుకువస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే కలమట వెంకట రమణమూర్తి మాట్లాడుతూ.. కాపు కార్పొరేషన్ పెట్టి దోచుకోవడానికే సరిపోయిందని, ఎవరికీ ఉపయోగపడలేదన్నారు. రానున్న ఎన్నికల్లో బీసీలంతా టీడీపీకి పట్టం కట్టేందుకు పాటుపడాలన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబును మళ్లీ సీఎంగా చేయాలని కోరారు.

150 కుటుంబాలు టీడీపీలో చేరిక

రట్టిణి, నడసందర, కొసమాల గ్రామాల నుంచి మాజీ సర్పంచ్ రవీంద్రనాథ్ జిన్నాతో పాటు 150 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి. వీరికి ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. అందరూ ఐక్యంగా టీడీపీ బలోపేతానికి పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కలమట సాగర్, నాయకులు ఎం.శ్రీధర్, వసంత్, పరమేష్‌రెడ్డి, భాస్కరరావు, పైడిరాజ్, గణపతి పాల్గొన్నారు.

అవినీతి ప్రభుత్వాన్ని సాగనంపుదాం

హిరమండలం: అవినీతి, అక్రమాల్లో కూరుకుపోయిన వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపాల్సి అవసరం ఎంతైనా ఉందని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శనివారం కొమనాపల్లి, రుగడ గ్రామాల్లో 'రా.. కదలిరా' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మళ్లీ గెలిచేందుకు సీఎం జగన్ మోస పూరిత మాటలు చెబుతున్నారని, వీటిని నమ్మవద్దన్నారు. గత ఎన్నికల్లో ముద్దులు పెట్టి అధికారంలోకి వచ్చిన జగన్ ఇప్పుడు గుద్దులు గుద్దుతున్నాడని ఎద్దేవా చేశారు. టీడీపీ హయాంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేశామని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించడం ద్వారా చంద్రబాబును మళ్లీ సీఎంగా చేయాలని కోరారు.

టీడీపీలోకి 80 కుటుంబాలు..

కొమనాపల్లి పంచాయతీలో సుమారు 80 కటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. మాజీ సర్పంచ్ బండి సూర్యనారాయణతోపాటు వార్డు సభ్యుడు పంగ లక్ష్మణరావు, బండి సిమ్మయ్య, రావాడ చిరంజీవి, బండి రామారావు, దుబ్బ చిన్నబాబు, నక్క ఉమామహేశ్వరరావు, నక్క బాబురావు, పంగ ఈశ్వరరావు, అంబటి అశిరయ్య, అంపిలి లక్ష్మణరావు, యందవ చిన్నయ్య తదితరులున్నారు. వీరికి ఎంపీ రామ్మోహన్ నాయుడు, మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణమూర్తి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కలమట సాగర్, జడ్పీటీసీ పి.బుచ్చిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు చెట్టు శ్రీనివాసరావు, బర్రి సురేష్, ఎస్.గోవిందరావు, లంక రామారావు, దారపు డిల్లేశ్వరరావు, తేజ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యంగా పార్టీ విజయానికి కృషి చేయాలి

● టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష

పలాసరూరల్: రానున్న ఎన్నికల్లో అందరూ కలిసికట్టుగా పని చేసి టీడీపీ విజయానికి కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. రంగోయి గ్రామంలో 'పల్లెపల్లెకు తెలుగుదేశం' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఓటర్లు, అసంతృప్తితో ఉన్న ఇతర పార్టీల నాయకులు టీడీపీలో చేరుతున్నారని, వారితో కలిసి పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు పీరికట్ల విఠల్‌రావు, డి.సంతోష్‌కుమార్, గంగారామ్, వంకల కూర్మారావు, దువ్వాడ హర్ష, మల్లేన శ్రీను, బి.లోకనాథం, కమలమ్మ, గొరకల దాసు పాల్గొన్నారు.



మందస: టీడీపీలో చేరిన వారితో గౌతు శిరీష

శిరీషకు జనసేన నేతల సన్మానం

పలాస: టీడీపీ నాయకురాలు గౌతు శిరీషను జనసేన నాయకులు శనివారం సత్కరించారు. శనివారం పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. టీడీపీ-జనసేన కలిసి ఈ ఎన్నికల్లో పోటీ చేయడం జరుగుతుందని, పలాసలో గౌతు శిరీష విజయానికి తామంతా కృషి చేస్తామన్నారు. ఇటీవల సోషల్ మీడియాలో వస్తున్న వదంతులను పట్టించుకోవద్దని సూచించారు. శిరీష మాట్లాడుతూ.. రాష్ట్రంలో సాగుతున్న అరాచక పాలనకు చరమగీతం పాడే సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో తమ్మినేని గంగారామ్, కిల్లి బాలకృష్ణ, కేదార్, నెయ్యిల వసంత్, అనిల్, దిలీప్, చలపతి, వసంత్, పలువురు జనసేన నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన బాహడాపల్లి గ్రామస్థులు

మందస: కక్షపూరిత ప్రభుత్వాన్ని తరిమికొట్టి రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. బాహడాపల్లిలో శనివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గ్రామానికి చెందిన పి.దేవరాజు, పాపయ్య, జగన్నాథం, బి.సోమేశ్వరరావు, కాంతమ్మ, కర్రి పార్వతి కుటుంబ సభ్యులతో కలిసి టీడీపీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు భావన దుర్యోధన, నాయకులు జీకే నాయుడు, దాసరి తాతారావు, నవీన్ కుమార్, భాస్కరరావు, ఎం.తాతారావు తదితరులు పాల్గొన్నారు.

బాబుతోనే భవిష్యత్తు

జలుమూరు (సారవకోట): టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్తు బాగుపడుతుందని మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. బుడితి గ్రామంలో శనివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రాభివృద్ధిని విస్మరించి వైసీపీ ప్రభుత్వం దోపిడీలు, దౌర్జన్యాలు, అరాచకాలతో రాష్ట్రాన్ని సర్వ నాశనం చేసిందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర బీసీ సెల్ ప్రతినిధి ధర్మాన తేజకుమార్, పార్టీ మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ, సర్పంచ్ పొన్నాన శంకరరావు, ఎంపీటీసీ మెండ మురళీకృష్ణ, నాయకులు నిక్కు జనార్దనరావు, గొల్లంగి మోహనరావు, కొల్లం అప్పారావు, సత్యనారాయణ, బగ్గు గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.



భవిష్యత్తుకు గ్యారెంటీ పత్రాలను అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే బగ్గు

కేలవలస సర్పంచ్ తదితరులు..

జలుమూరు (సారవకోట): కేలవలస సర్పంచ్ చిన్నాల సింహాచలంతోపాటు మదనాపురం మాజీ సర్పంచ్ కోనారి సింహాచలం, రేయమ్మ దంపతులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. శుక్రవారం రాత్రి వారికి ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

టీడీపీ-జనసేన ప్రభుత్వానికి పట్టం కట్టండి

టెక్కలి: త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల్లో టీడీపీ-జనసేన ప్రభుత్వానికి పట్టం కట్టాలని టీడీపీ మండల అధ్యక్షుడు బగాది శేషగిరి అన్నారు. శనివారం పరశురాంపురంలో 'బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో నేతలు తురక నీలాచలం, దల్లి ప్రసాద్‌రెడ్డి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



బాబు ష్యూరిటీ నిర్వహిస్తున్న టీడీపీ నేతలు

వైసీపీ వికృత చేష్టలు దారుణం

వజ్రపుకొత్తూరు: టీడీపీకి వస్తున్న ఆదరణను చూడలేక పార్టీకి చెందిన ఫ్లెక్సీలను చించివేయడం దారుణమని, వైసీపీ నేతలు ఇటువంటి వికృత చేష్టలను కట్టి పెట్టాలని టీడీపీ మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ పుచ్చ ఈశ్వరరావు అన్నారు. మండలంలో పలు గ్రామాల్లో చించివేతకు గురైన టీడీపీ ఫ్లెక్సీలను వారు పరిశీలించారు. విలేకరులతో మాట్లాడుతూ.. ఇకపై ఇటువంటి చర్యలకు స్వస్తి పలకాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అర్సవెల్లి ఉమామహేశ్వరరావు, బత్తిని మోహనరావు, కణితి సురేష్, కర్ని రమణ, బి.శశిభూషణ్, మురిపింటి పాపారావు, వి.రామారావు, కె.మోహనరావు, శాంతమూర్తి పాల్గొన్నారు.



టి.గడివూరులో చించివేసిన ఫ్లెక్సీని చూపిస్తున్న నేతలు

పాతపట్నం-గోపాలపురం మధ్య కాజ్‌వే నిర్మించాలి

పాతపట్నం: పాతపట్నం-కె.గోపాలపురం, హెచ్‌గోపాలపురం గ్రామాలకు రాకపోకల కోసం ఎత్తైన కాజ్‌వే నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరారు. ఈ మేరకు శనివారం ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడును కలిసి వినతిపత్రం అందించారు. ఈ గ్రామాల మధ్య మహేంద్రతనయ నదిపై పాత కాజ్‌వే ఉందని, అయితే అది శిథిలావస్థకు చేరుకోవడంతో వర్షాకాలంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఏ నిమిషంలో కాజ్‌వే కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొందని, అందువల్ల తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. వినతిపత్రం అందించిన వారిలో ఆయా గ్రామాల ప్రజలు తడక లోకేశ్వరరావు, వై.లక్ష్మీనారాయణ, బి.సుధాకరరావు, బి.రామయ్య, మల్లి భాస్కరరావు ఉన్నారు.

నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలి



నిర్వాసితుల సమస్యలు తెలుసుకుంటున్న కుమార్

మెళియాపుట్టి: ఆఫ్‌షోర్ నిర్వాసితులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని దండకారణ్య లిబరేషన్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సవర కుమార్ డిమాండ్ చేశారు. శనివారం దాసుపురం గిరిజన గ్రామంలో పర్యటించి స్థానికుల నుంచి సమస్యలను అడిగి తెలుసు కున్నారు. వైసీపీ ప్రభుత్వం నిర్వాసితులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారన్నారు. త్యాగం చేసిన వారిని వదిలేయడం వైసీపీకి అలవాటుగా మారడం బాధాకరమన్నారు. తక్షణం స్పందించి వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఆయనతో పాటు పలువురు గ్రామస్థులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పలాస: కేటీ రోడ్డులో విద్యుత్ లైన్ల అభివృద్ధి పనులు చేయనున్నందున ఆదివారం ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ జి.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. హరిశంకర్ థియేటర్, గాంధీనగర్, ఎంపీడీవో కార్యాలయం రోడ్డు, తిలక్‌నగర్, ఎల్‌ఐసీ భవనం వెనుకభాగం, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం రోడ్డు, ఆర్కే పోలీసు కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వ విద్యార్థులతో కళాశాల డైరెక్టర్ తదితరులు

కె.కొత్తూరు (టెక్కలి): ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం 2005 సంవత్సరం పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. పూర్వ విద్యార్థులు ఒకచోట కలవడం ఆనందంగా ఉందన్నారు. ఫిబ్రవరి నెలాఖరులోగా గోకార్ట్, ఏక్లాన్ పేర్లతో జాతీయస్థాయి పోటీలు నిర్వహించనున్నా మన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు, డీన్ డాక్టర్ డి.విష్ణుమూర్తి, కో-ఆర్డినేటర్ డాక్టర్ యుగంధర్, పూర్వ విద్యార్థులు లక్ష్మీకిరణ్, రామ్‌జీ, వరుణ్, షణ్ముఖ, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత నేత్ర వైద్య పరీక్షలు

పోలాకి: స్థానిక పీహెచ్‌సీ ప్రాంగణంలో సోమవారం ఉచిత నేత్ర వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్టు వైద్యాధికారి శ్రీనాథ్, సాంబశివరావు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు విశాఖ శంకర్ ఫౌండేషన్ వైద్య శాల సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తారన్నారు. కంటి శస్త్ర చికిత్సలు అవసరమైన వారిని ఎంపిక చేసి విశాఖకు తరలించి ఆపరేషన్లు చేస్తారన్నారు. ఇతర వివరాలకు ఆరోగ్య కేంద్రంలో సంప్రదించాలన్నారు.

ఏఐఎస్ఎఫ్ నేత మన్మథరావు మృతి



మన్మథరావు (ఫైల్)

నరసన్నపేట: పట్టణానికి చెందిన భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) నేత నెయ్యల మన్మథరావు అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతిచెందారు. 1979 నుంచి విద్యార్థి సంఘ నాయకుడిగా నరసన్నపేట, కోటబొమ్మాళి మండలాల్లో పనిచేసి విద్యార్థి సమస్యలపై పోరాటం చేశారు. అలాగే సీపీఐ, వివిధ ప్రజా సంఘాల్లోనూ సేవలందించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, సనపల నర్సింహులు, లక్కోజి శ్రీను తదితరులు నివాళులు అర్పించారు.

తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి

కోటబొమ్మాళి: రబీ సీజన్‌లో వేరుశనగకు సోకే తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలని టెక్కలి వ్యవసాయశాఖ ఏడీ బీవీ తిరుమలరావు అన్నారు. శనివారం యలమంచిలి పంచాయతీలో రైతులు సాగు చేస్తున్న వేరు శనగ పంటను పరిశీలించారు. వేరుశనగకు సోకే తెగుళ్లు, వాటి నివారణపై రైతులకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఏవో ఎస్.గోవిందరావు, సర్పంచ్ కవిటి రామరాజు, రైతులు పాల్గొన్నారు.

30 మద్యం బాటిళ్లు స్వాధీనం

నందిగాం: పెదతామరాపల్లి కూడలిలో శనివారం రాత్రి తనిఖీ నిర్వహించి 30 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మహ్మద్ అమీర్ తెలిపారు. గ్రామానికి చెందిన సొండి జగ్గారావు నందిగాం నుంచి రూ.4500 విలువ చేసే బాటిళ్లను తీసుకువస్తుండగా పట్టుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కుటుంబ వ్యవస్థలో స్త్రీలదే ప్రత్యేక పాత్ర

కోటబొమ్మాళి: కుటుంబ వ్యవస్థలో స్త్రీలదే ప్రత్యేక పాత్ర అని, తల్లిదండ్రులను, అత్తమామలను సమానంగా చేసుకుంటే తర్వాతి తరాలకు ఆదర్శంగా నిలువవచ్చని జూనియర్ సివిల్ న్యాయాధికారి బీఎంఆర్ ప్రసన్న లత అన్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో లింగ వివక్ష నివారణ, మహిళలకు రక్షణ చట్టాలపై న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయ వాదులు వెలమల అప్పలనాయుడు, పంచిరెడ్డి అర్జునరావు, రోణంకి మల్లేశ్వరరావు, ఈవోపీఆర్డీ బి.రామారావు, ఐసీడీఎస్ పీవో సీహెచ్ హైమావతి తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞతతో వ్యవహరించాలి

పాతపట్నం: విద్యార్థులు విజ్ఞతతో వ్యవహరించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎం.రోహిణి అన్నారు. శనివారం స్థానిక మహేంద్ర జూనియర్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గుడ్‌టచ్, బ్యాడ్ టచ్ అనే అంశంపై మాట్లాడారు. ఎలాంటి సమయంలోనైనా విద్యార్థుల రక్షణ కోసం చైల్డ్‌లైన్ 1098లో సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యు.దాలయ్య, న్యాయవాదులు బి.సత్యనారాయణ, ఎం.రమణ, సూర్యనారాయణ, ఫల్గుణరావు, కళాశాల అధినేత మల్లిబాబు, ప్రిన్సిపాల్ ఆంజనేయులు పాల్గొన్నారు.





కోటబొమ్మాళి, పాతపట్నంలలో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ న్యాయాధికారులు ప్రసన్నలత, రోహిణి

నిర్వాసితులను ఆదుకునేందుకు కృషి

పలాసరూరల్: ఫ్లైఓవర్ (రైల్వే ఓవర్ బ్రిడ్జి) నిర్వాసితులను ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో శనివారం పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ ఫ్లైఓవర్ నిర్వాసితులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పట్టణంలో ట్రాఫిక్ పెరిగిన దృష్ట్యా ఫ్లైఓవర్ ఆవశ్యకతను గుర్తించి, నిర్మాణాన్ని చేపడుతున్నామని, దీనికి స్థలాలను ఇచ్చిన 125 మందికి పట్టాలను అందజేస్తున్నామన్నారు. వారికి కేటాయించిన స్థలంలో నిర్వాసితులు హద్దులు వేసుకొని రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో భరత్ నాయక్, తహసీల్దార్ ఎల్.మధుసూదనరావు, డీటీ లక్ష్మీనారాయణ, చైర్మన్ బల్ల గిరిబాబు, కౌన్సిలర్లు దుర్గాశంకర్ పండా, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సాంబ దశమి వేడుకలు



పలాసరూరల్: పుష్యమాసంలో పుత్ర సౌభాగ్యం కోరు తూ ఒడియా బ్రాహ్మణ మహిళలు సాంబ దశమి వేడుకలను శనివారం నిర్వహించారు. తర్లాకోట, రెంటికోట, పండాశాసనం, అల్లుకోల, పలాస-కాశీబుగ్గల్లో వివిధ రకాల పిండివంటలు చేసి సూర్య భగవానునికి పూజలు చేసి సమర్పించారు. కృష్ణుడు, జాంబవతిల తనయుడు సాంబుడికి కుష్ఠురోగం రావడంతో సూర్య భగవానుణ్ని ఉపాసించి రోగాన్ని నయం చేసుకొని వచ్చిన రోజున సాంబ దశమిగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని పలువురు మహిళలు తెలిపారు.

గణతంత్ర వేడుకలకు నందిగాం సర్పంచ్ ఎంపిక



రవణమ్మ

నందిగాం: దేశ రాజధాని ఢిల్లీలో ఈనెల 26న జరగనున్న గణతంత్ర వేడుకలకు నందిగాం సర్పంచ్ జడ్యాడ రవణమ్మ వెళ్లనున్నారు. ఈ మేరకు పంచాయతీ రాజ్ కమిషనరేట్ నుంచి ఉత్తర్వులు అందాయి. రాష్ట్ర వ్యాప్తంగా 13 మంది సర్పంచ్‌లు ఎంపికవగా, వారిలో నందిగాం సర్పంచ్‌కు స్థానం లభించింది. గతంలో పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా నందిగాం ఉత్తమ పంచాయతీగా ఎంపికవగా గతఏడాది ఏప్రిల్ 24న సర్పంచ్ జడ్యాడ రవణమ్మ అవార్డు అందుకున్నారు. స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భం గా జరగనున్న వేడుకల్లో అరుదైన అవకాశం రావడం ఆనందంగా ఉందని ఆమె పేర్కొన్నారు.

రేపు మండల సమావేశం

టెక్కలి: టెక్కలి మండల సమావేశం సోమవారం ఉదయం 10.30 గంటలకు ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో చింతాడ లక్ష్మీబాయి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ అట్ల సరోజినమ్మ అధ్యక్షతన జరుగు సమావే శానికి సభ్యులతో పాటు వివిధ శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు.

కులగణన పారదర్శకంగా చేపట్టాలి

జలుమూరు: కుల గణన సర్వే పారదర్శకంగా చేపట్టేలా పర్యవేక్షణాధికారులు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ బి.సత్యం అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో కులగణన పర్యవేక్షణాధికారులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామ సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి చేపడు తున్న సర్వేని ప్రతిరోజూ పరిశీలించాలన్నారు. అలసత్వం వహిచే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీడీవో ఎ.దామోదరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌వైకేఎస్ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా రాజేష్



అట్టాడ రాజేష్

నందిగాం: నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ జిల్లా సలహా సంఘ సభ్యుడిగా పెద్దలవునిపల్లికి చెందిన అట్టాడ రాజేష్ నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్రమంత్రి అనురాగ్‌సింగ్ ఠాకూర్ ఆదేశాలపై ఉత్తర్వులు వచ్చాయని ఆయన తెలిపారు. తనకు సలహాసంఘ సభ్యుడిగా నియమించేందుకు కృషి చేసిన కేంద్ర మంత్రితో పాటు బీజేపీ నేతలకు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించాలి

టెక్కలి: రోడ్లపై ప్రయాణించేవారు తప్పని సరిగా భద్రతా ప్రమాణాలను పాటించాలని ఎంవీఐ డి.సంజీవరావు అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాలు సందర్భంగా శనివారం ఆర్టీసీ గ్యారేజ్‌లో డ్రైవర్లు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రహదారి భద్రతా నిబంధనలు పాటిస్తే ప్రమాదాల సంఖ్యను తగ్గించ వచ్చన్నారు. డ్రైవర్ చేతిలో ఉన్నది ఒక్క స్టీరింగ్ మాత్రమే కాదని, కొందరి జీవితాలు అని అన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ఎం.శ్రీనివాసరావు, అసిస్టెంట్ మేనేజర్ బీఎస్ఎన్ మూర్తి, మెకానికల్ ఇన్‌చార్జి రామారావు, యూనియన్ ప్రతినిధులు నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంవీఐ

న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి



రణస్థలం: రామతీర్థం జంక్షన్‌లో అంగన్‌వాడీల రాస్తారోకో


సరుబుజ్జిలి: జంక్షన్‌లో అంగన్‌వాడీల మానవహారం


ఇచ్ఛాపురం: మౌనం పాటిస్తూ అంగన్‌వాడీల నిరసన


ఇచ్ఛాపురం: నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

● కొనసాగుతున్న అంగన్‌వాడీల నిరసన

న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు డిమాండ్ చేస్తున్నారు. గత 40 రోజులుగా తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ మేరకు శనివారం జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు కొనసాగించారు.

- ఆంధ్రజ్యోతి బృందం



ఆమదాలవలస: ర్యాలీగా వెళ్తూ..


గార: ఎంపీడీవో కార్యాలయం ఎదుట..



నరసన్నపేట: కోటి సంతకాలు సేకరణలో..


జలుమూరు: సారవకోట తహసీల్దారు కార్యాలయం ఎదుట..


కోటబొమ్మాళి: ఐసీడీఎస్ పీవో కార్యాలయం ఎదుట..

స్వగ్రామానికి సాయినికేష్ మృతదేహం


సాయినికేష్ (ఫైల్)

సరుబుజ్జిలి: కొత్తకోట వాసి రాకోటి సాయినికేష్ (21) అమెరికాలో మృతిచెందాడు. ఈ మేరకు శనివారం గ్రామంలో అంత్యక్రియలు జరిగాయి. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. కొత్తకోట గ్రామానికి చెందిన రాకోటి వెంకటరమణ, ఆదిలక్ష్మి దంపతుల కుమారుడు నికేష్ హార్ట్‌ఫోర్ట్ యూనివర్సిటీలో ఎమ్మెస్సీ చదువుతున్నాడు. నికేష్‌తోపాటు తెలంగాణ రాష్ట్రం వనపర్తి జిల్లాకు చెందిన దినేష్ కూడా అదే వర్సిటీలో చదువుతున్నాడు. వీరిద్దరూ ఒకే రూమ్‌లో ఉండేవారు. అయితే ఈనెల 14న ఇద్దరు కూడా అపస్మారకస్థితిలోకి చేరారు. అందుబాటులో ఉన్నవారు మొదట ఆసుపత్రిలో ఉన్నారని తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. ఈ విషయంపై కుటుంబ సభ్యులు ఆరాతీయగా నిద్రిస్తున్న సమయంలో విషవాయువు పీల్చడం వల్ల ఆరోగ్యం క్షీణించి వారిద్దరూ మృతి చెందినట్టు అమెరికాలోని ఇండియాకు చెందిన తెలుగు సంఘాల వారు సమాచారం అందించారు. ఈ మేరకు తెలుగు సంఘాల ఆర్థిక సాయంతో మృతదేహాలను ఇండియాకు తీసుకొచ్చారు. శనివారం సాయినికేష్ మృతదేహం కొత్తకోట తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


శ్రీకాకుళం క్రైం: పొలం పనులకు వెళ్లిన ఓ రైతు విద్యు దాఘాతంతో మృతి చెందిన ఘటన నైరా గ్రామంలో చోటుచే సుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రూరల్ మం డలం నైరా గ్రామానికి చెందిన రైతు బమ్మిడి సూర్యనారాయణ (48) శనివారం ఉదయం పొలం పనులకు వెళ్లాడు. అప్పటికే విద్యుత్ తీగలు తెగిపడి ఉన్నాయి. ఇది గమనించని సూర్యనారాయణ కాలికు తీగలు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఇది గమనించిన కొందరు రైతులు అతడి కుటుంబ సభ్యులకు, రూరల్ పోలీసులకు సమాచారం అందించడంతో వారంతా ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. సూర్యనారాయణ భార్య సంజీవి ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎ.విజయకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా సూర్యనారాయణకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ఆటోను ఢీకొన్న కారు

● ఏడుగురికి తీవ్ర గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం

నరసన్నపేట: సత్యవరం కూడలి.. గ్యాస్ గోదాం సమీపంలో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురికి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నరసన్నపేట నుంచి శ్రీకాకుళం వైపు ప్రయాణికులతో ఆటో వెళ్తుండగా.. వెనుక నుంచి వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో ఆటో పల్టీలు కొట్టింది. ఈ ఘటనలో ఏడుగురికి తీవ్ర గాయాలు కాగా వీరిలో ముగ్గురిని శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించారు. బిందుమాధవి అనే మూడు నెలల చిన్నారి ప్రమాదం నుంచి బయటపడింది. మిగిలిన వారిలో బంటుపల్లి చిన్నమ్మడు, గడ్డి నిరోషా, కోరాడ విజయలక్ష్మి, ఆటో డ్రైవర్ కలదుండు శ్యామలరావు, ఉరజాన కృష్ణవేణిలను నరసన్నపేట ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. వీరిలో కోరాడ విజయలక్ష్మి పరిస్థితి విషమంగా ఉండడంతో 108లో శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించారు. మిగిలిన ఇద్దరి వివరాలు తెలియాల్సి ఉంది. కారు డ్రైవర్ మద్యం తాగి ఉండడం వల్ల ఈ ప్రమాదం జరిగినట్టు స్థానికులు తెలిపారు. కారును ఆపకుండా ముందుకు వెళ్లడంతో గమనించిన స్థానికులు దేవాది గ్రామం వద్ద అడ్డుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ అపికినాయుడు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు


లారీ కింద పడిన ద్విచక్రవాహనం

నందిగాం: సుభద్రాపురం సమీపంలోని జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలయ్యాయి. టెక్కలి మండలం కొండభీంపు రానికి చెందిన దాసరి కృష్ణారావు ద్విచక్ర వాహనంపై సుభద్రాపురం వచ్చి తిరిగి వెళ్లే క్రమంలో టెక్కలి నుంచి పలాస వైపు వెళ్తున్న లారీ ఢీకొంది. దీంతో కృష్ణా రావు గాయపడ్డాడు. వెంటనే అతడిని హైవే అంబులెన్స్‌లో టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి రిఫర్ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు హెచ్‌సీ ఢిల్లేశ్వరరావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

భర్త అదృశ్యంపై మహిళ ఫిర్యాదు


రాము(ఫైల్)

శ్రీకాకుళం క్రైం: నగరంలోని తోటపాలెం రోడ్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న అరసవల్లి రాము అనే 55 ఏళ్ల వ్యక్తి కనిపించడం లేదంటూ అతని భార్య రమణమ్మ శనివారం ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 13వ తేదీ మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో అపార్ట్‌మెంట్ నుంచి బయటకు వెళ్లిన రాము ఇంత వరకు రాలేదు. బంధువల ఇళ్లలో, పరిసర ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో శనివారం రమణమ్మ ఫిర్యాదు చేయగా ఎస్ఐ బలివాడ గణేష్ కేసు నమోదు చేశారు.

లోలుగులో 'బాబు ష్యూరిటీ'


పొందూరు: లోలుగులో బాబు ష్యూరిటీ..

పొందూరు: లోలుగులో శనివారం బాబు ష్యూరిటీ- భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అందించే సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా తెలుగుయువత ఆర్గనైజింగ్ కార్యదర్శి లోలుగు వెంకట్, నాయకులు సీహెచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో విజయం తథ్యం

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్


పొందూరు: బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న రవికుమార్

పొందూరు: రానున్న సాధారణ ఎన్నికల్లో తమ పార్టీ విజయం తథ్యమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికు మార్ తెలిపారు. శనివారం మండలంలోని తోలాపిలో టీడీపీ నాయకుల కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం జగన్‌రెడ్డి నియం తృత్వాన్ని భరించలేక వైసీపీ నాయకులు ఆ పార్టీని వీడు తున్నారని, త్వరలోనే వైసీపీ ఖాళీ కావడం ఖాయమని తెలి పారు. అప్పులకుప్పగా మార్చిన రాష్ట్రాన్ని గాడిలో పెట్టాలంటే చంద్రబాబుతోనే సాధ్యమని రాష్ట్రప్రజలకు అర్థమైందని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం ప్రతిఒక్కరిని మోసం చేసిందని ఆరోపించారు. రవికుమార్‌తో పాటు స్థానిక టీడీపీ నాయకులు ఉన్నారు.

● **సరుబుజ్జిలి:** సరుబుజ్జిలి, ఆమదాలవలస మండా లతోపాటు ఆమదాలవలస మునిసిపాలిటీలో ఇటీవల మృతి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తల కుటుంబ సభ్యులను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ శనివారం పరామర్శించారు. సరుబుజ్జిలి మండలంలోని మూలసవలా పురం, తురకపేట, ఆమదాలవలస మండలంలోని కనుగువలస, మునిసిపాలిటీలోని మెట్టక్కివలస, కండ్రిపేటల్లో మృతుల కుటుంబాలను పరామర్శించి, వారితో మాట్లాడారు. ఆయన వెంట టీడీపీ నాయకులు తర్లాడ సురేం ద్ర, గదిలి మల్లేశ్వరరావు, నూక రాజు,రాడ విజయ్‌కుమార్ ఉన్నారు.

ఫైరింగ్‌లో మెలకువలు నేర్చుకోవాలి


ఫైరింగ్ ప్రాక్టీస్ చేస్తున్న ఎస్పీ రాధిక

ఎచ్చెర్ల: ఫై రింగ్‌లో మెలకు వలు నేర్చుకో వాలని పోలీసు సిబ్బందికి ఎస్పీ జీఆర్ రాధిక సూచించారు. చినరావుపల్లి పోలీసు ఫైరిం గ్ రేంజ్‌లో శనివారం ద్వితీయ అర్ధ వార్షిక ఫైరింగ్ సాధన నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. సిబ్బంది ఎప్పటికప్పుడు పనితీరును మెరుగుపర్చుకోవాల న్నారు. ఫైరింగ్‌లో అనుమానాలను నివృత్తి చేసుకోవాలన్నారు. ఆయుధాలను క్షుణ్ణంగా పరిశీలించి, శుభ్రం చేసుకోవాలన్నారు. ఫైరింగ్‌లో స్వయం గా పాల్గొన్న ఎస్పీ సాధన చేసి.. టార్గెట్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎస్పీ టీపీ విఠలేశ్వర్, జె.తిప్పేస్వామి, డి.బాలచంద్రారెడ్డి, జి.నాగేశ్వరరెడ్డి, విజయకుమార్, ఎస్.వాసుదేవ్, జీవీ ప్రసాద్, ట్రైనీ డీఎస్పీ సీహెచ్ రాజా, ఏఆర్ డీఎస్పీ కేఎస్ వాసన్ పాల్గొన్నారు.

కులగణనలో ఆస్తుల వివరాలు ఎందుకు?


విలేకరులతో మాట్లాడుతున్న గొండు శంకర్

శ్రీకాకుళం అర్బన్/ అరసవల్లి: గులగణనను తాము స్వాగతిస్తున్నామని, అయితే ప్రజల ఆస్తుల వివరాలు ఎందుకు అడుగుతున్నారని టీడీపీ యువ నాయకులు గొండు శంకర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నాలుగున్నరేళ్లగా గుర్తుకురాని ఈ ప్రక్రియ ఎన్నికల ముందు వైసీపీ ప్రభుత్వానికి గుర్తుకురావడం వెనుక అంతర్యమేంటని గొండు శంకర్ ప్రశ్నించారు. రూరల్ మండలం కిష్టప్పపేట గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ ఉపకులాల వివరాలు తెలుసుకోవడం మంచి పరిణామమని, అయితే ప్రజల్లో విపక్షత లేపేందుకు ఇదో స్ట్రాటజీగా ప్రభుత్వం ఉపయోగిస్తుందన్నారు. కులగణన పేరుతో ప్రత్యర్థులను గుర్తించి, దెబ్బకొట్టాలనే దురుద్దేశంతోనే ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఎన్నికల ముందు వలంటీర్లతో కులగణన చేయించడం వెనుక వైసీపీ కుతంత్ర రాజకీయాలు దాగి ఉన్నాయని ఆరోపించారు. ప్రభుత్వం తప్పుడు ఆలోచన మానుకొని కులగణను సక్రమమైన రీతిలో చేట్టాలని కోరారు.

ఉత్తమ సేవలకు ప్రశంసలు

గుజరాతీపేట: జాతీయ సేవా పథకం ద్వారా చత్తీస్‌గఢ్‌లో నిర్వహించిన జాతీయస్థాయి యూత్ మీట్‌లో గాయత్రి కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాలకు చెందిన విద్యార్థులు హరిణి, రాంప్రసాద్‌లు ఉత్తమ సేవలకు గాను ప్రశంసా పత్రాలను అందుకున్నారు. ఈ నెల రెండో వారంలో రాయ్‌పూర్ విశ్వవిద్యాలయంలో జరిగిన ఈ మీట్‌లో ఉత్తమ సేవలందించినందుకు కళాశాల ప్రిన్సిపాల్ పులఖండం శ్రీనివాసరావు, విద్యాసంస్థల అధినేత జీవీ స్వామినాయుడు, ఎన్ఎస్ఎస్ పీవోలు మహేష్, ధన్వంతరి, కెవివి.సత్యన్నారాయణ, ఐక్యూఏసి డా.మార్తాండకృష్ణ, బాలసుందర్, రాజ్‌కుమార్ తదితరులు అభినందించారు.

శోభయాత్ర రథాలు ప్రారంభం


రథాలను ప్రారంభిస్తున్న ఎన్ఈఆర్

రణస్థలం: అయోధ్యలో ఈ నెల 22న శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ చేపట్టినున్న నేపథ్యంలో శనివారం శోభ యాత్ర రథాలను విజయనగరం జిల్లా బీజేపీ అధ్యక్షుడు నడుకుదిటి ఈశ్వరరావు తన క్యాంపు కార్యాలయంలో ప్రారంభించారు. ఎచ్చెర్ల నియోజకవర్గం పరిధిలోని అన్ని గ్రామాల్లో ఈ శోభయాత్ర రథాల ద్వారా ప్రచారం చేయనున్నట్టు తెలిపారు. సోమవారం తెల్లవారి జాము నుంచి రణస్థలం మండల కేంద్రంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరగనున్నట్టు తెలిపారు. అదేవిధంగా ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఉన్న ప్రతి రామ మందిరంలో పూజలు, భజనలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు ఇజ్జాడ శ్రీనివాసరావు, సంపతిరావు నాగేశ్వరరావు, మన్నె సురేష్‌కుమార్, టొంపల అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రతా నియమాలు పాటించాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ నవీన్, రవాణా శాఖ అధికారులు

కలెక్టరేట్: వాహనదారులు రహదారి భద్రతా నియమాలను పాటించాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎం.నవీన్ పిలుపునిచ్చారు. ఈ నెల 20 నుంచి ఫిబ్రవరి 19వ తేదీ వరకు జిల్లాలో రహదారి భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు శనివారం ఇన్‌చార్జి కలెక్టర్ తన చాంబర్‌లో ఇందుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మీ క్షేమమే కుటుంబ క్షేమమని, కుటుంబానికి శ్రీరామరక్ష అని గుర్తుంచుకోవాలన్నారు. మైనర్లు వాహనాలు నడపితే నేరమన్నారు. మద్యం తాగి వాహనం నడపరాదని, సీటు బెల్ట్, హెల్మెట్ ధరించాలని, ఫోన్‌లో మాట్లాడుతూ వాహనం నడపరాదని అన్నారు. కార్యక్రమంలో ఉప రవాణా కమిషనర్, రవాణాశాఖ అధికారి ఎస్ఎల్‌వీఎం దేవి, ఏవో ఎస్ఆర్ఎం రాజు, ఎంవీఐ పీవీ గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులతో కిక్కిరిసిన రైల్వేస్టేషన్


ప్రయాణికులతో కిటకిటలాడుతున్న రైల్వే ఫ్లాట్ ఫారం

ఆమదాలవలస: శ్రీకాకుళం రోడ్డు రైల్వేస్టేషన్ శనివారం ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. వివిధ ప్రాంతాల నుంచి సంక్రాంతికి వచ్చిన ప్రయాణికులు తిరుగు ప్రయాణమ య్యారు. బత్తిలి, పాతపట్నం, కొత్తూరు, హిరమండలం, సరుబుజ్జిలి, బూర్జ, పాలకొండ, ఆమదాలవలస, శ్రీకాకుళం, ఎచ్చెర్ల పరిసర ప్రాంతాల ప్రయాణికులు శ్రీకాకుళం రోడ్డు రైల్వేస్టేషన్ నుంచి రాకపోకలు సాగించారు. దీంతో మూడో ఫ్లాట్‌ఫారం విశాఖపట్నం వైపు వెళ్తున్న రైళ్లతో రద్దీగా కనిపించింది.

రేపు ఇంటింటా రామజ్యోతి



సరుబుజ్జిలి: అయోధ్య రామ మందిర ప్రారంభం పురస్కరించుకుని సోమవారం గ్రామాల్లోని అందరి ఇళ్లల్లో ఇంటింటా రామ (ధర్మ) జ్యోతి కార్య క్రమాన్ని నిర్వహించ నున్నట్లు సేవాభారతి జిల్లా సమన్వయకర్త కనుగుల సత్యం, జిల్లా ధర్మ ప్రచారక్ వి.మాధవ్ పేర్కొన్నారు. మండలంలోని రొట్టవలస వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ధార్మిక జాగరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 22వ తేదీ సాయంత్రం ఇంటి గుమ్మం వద్ద జ్యోతులు వెలిగించాలన్నారు. కార్యక్రమంలో మందపల్లి రామకృష్ణారావు, రవికుమార్, రమణ, గోవిందరావు, రమణ, ఆనందరావు, ముకుందరావు పాల్గొన్నారు.

నాలుగేళ్లుగా..

● రాళ్లు తేలిన హుకుంపేట రోడ్డు
● రాకపోకలకు అవస్థలు
● పట్టించుకోని పాలకులు




రాళ్లు తేలి అధ్వానంగా తయారైన హుకుంపేట రోడ్డు

గార: ఈ ఫొటోలు చూస్తుంటే ఏ మారుమూల గిరిజన గ్రామానికి వెళ్లే రోడ్డు అనుకుంటే మీరు పొరబడినట్టే.. ఎందుకంటే జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో గల గార మండలం వమరవల్లి పంచాయతీ హుకుంపేట గ్రామానికి వెళ్లే పంచాయతీ రాజ్ రోడ్డు ఇది. నిత్యమూ రద్దీగా ఉండే ఈ రోడ్డు రాళ్లు తేలి అధ్వానంగా తయారైంది. కనీసం నడవడానికి కూడా వెళ్లలేని పరిస్థితి. కళింగపట్నం, శ్రీకాకుళం (సీఎస్‌పీ) రోడ్డు నుంచి ఈ గ్రామం వరకు సుమారు 1.23 కిలోమీటర్లు పొడవు ఉంది. ఈ రోడ్డు అభివృద్ధికి ఉపాధి పథకం నిధులు రూ.1.10 కోట్లు మంజూరు కావడంతో నాలుగేళ్ల కిందట పనులు ప్రారంభించారు. మొదట్లో చురుగ్గా సాగిన పనులు బిల్లుల చెల్లింపుల్లో జాప్యం కావడంతో మెటల్ వేసి రోలింగ్ చేసి వదిలేశారు. ఆ తర్వాత ఈ రోడ్డు పనులు నిలిచిపోవడంతో నాన్ ప్రయార్టీ కింద ప్రభుత్వం రద్దుచేసింది. రోడ్డు పనులు పూర్తి స్థాయిలో జరగకపోవడంతో స్థానికులు పలు దఫాలుగా మంత్రి ధర్మాన ప్రసాదరావు దృష్టికి తీసుకువచ్చారు. అయినా ఇంత వరకూ ఎటువంటి చర్యలు లేకపోవడం విశేషం. దీనిపై ఇంజినీరింగ్ నక్క చక్రధరరావు మాట్లాడుతూ.. ఉపాధి పథకం ద్వారా రూ.25 లక్షలతో ఈ రోడ్డులో 500 మీటర్లు పొడవునా సిమెంట్ రోడ్డు అభివృద్ధి పరచనున్నట్టు తెలిపారు. వీలున్నంత తొందరలో ఈ రోడ్డు పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

సైకో జగన్ రెడ్డిని బహిష్కరించండి


మాట్లాడుతున్న బీవీ రామ్

ఆమదాలవలస: సైకో సీఎం జగన్‌రెడ్డిని ఉత్తరాంధ్ర ప్రజలు బహిష్కరించాలని రాష్ట్ర తెలుగుశక్తి అధ్యక్షుడు బీవీ రామ్ పిలుపునిచ్చారు. శనివారం ఆమదాలవలస టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. భీమిలి ప్రాంతం లో ఈనెల 25న మళ్లీ ఉత్తరాంధ్ర ప్రజలను మోసగించడానికి జగన్‌రెడ్డి నిర్వహించే సమావేశం ప్రజలు బహిష్క రించాలన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బొడ్డేపల్లి సత్యవతిని బీవీ రామ్ ఆమె స్వగృహంలో కలిశారు. పీసీసీ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపడుతున్న వైఎస్ షర్మిల ఒక మహిళగా ఆలోచించి రాష్ట్రంలో జగన్‌రెడ్డి పాలనలో అదృశ్యమైన 32 వేల మంది మహిళలపై స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సత్యవతికి వినతిపత్రం అందించారు. కార్య క్రమంలో విశాఖ పార్లమెంట్ టీడీపీ కార్యదర్శి బోడేపూడి దొరబాబు, నరసన్నపేట సీబీఎస్ ఆర్మీ సభ్యుడు మెరుగు శరణ్‌కుమార్ పాల్గొన్నారు.

23న ఎల్ఎల్‌బీలో స్పాట్ అడ్మిషన్లు

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలోని లా విభాగంలో మూడేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సులో మిగులు సీట్ల భర్తీకి ఈ నెల 23న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్టు వర్సిటీ రిజిస్ట్రార్ బిడ్డిక అడ్డయ్య శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎల్ఎల్‌బీ కోర్సులో 40 సీట్లకు ఇప్పటికే 29 సీట్లు భర్తీ అయ్యాయని చెప్పారు. లాసెట్ రాసి ర్యాంకు పొందిన అభ్యర్థులు మాత్రమే ప్రవేశానికి అర్హులని చెప్పారు. సంబంధిత ఒరిజనల్ సర్టిఫికెట్లతో పాటు, లాసెట్ ర్యాంకు కార్డు, ఇతర సర్టిఫికేట్లతో ఆసక్తి గల అభ్యర్థులు హాజరుకావాలన్నారు. ఈ నెల 23న ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ ప్రక్రియ జరుగుతుందన్నారు.

షర్మిలకు పీసీసీ పగ్గాలపై హర్షం

కంచిలి: వైఎస్ షర్మిలాకు పీసీసీ పగ్గాలు అప్పగించడంపై కాంగ్రెస్ పార్టీ ఇచ్ఛాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి బీపీ యాదవ్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఏపీలో కాంగ్రెస్ మరింత బలోపేతం కావడం ఖాయమని తెలిపారు.

23న కేంద్రీయ విద్యాలయంలో చిత్రలేఖన పోటీలు

అరసవల్లి: పెద్దపాడు సమీపంలోని కేంద్రీయ విద్యాలయంలో ఈ నెల 23న చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎస్.ఆలం శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధాని మోదీ రచించిన ఎక్సమ్ వారియర్స్ పుస్తకంలోని మంత్రాలు, విభిన్న నేపథ్యాల్లో ఈ పోటీలు జరుగుతాయని, ఉదయం 10 గంటల నుంచి 12 గంటల మధ్య జరుగుతాయన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు పెయింటింగ్ మెటీరియల్ అందిస్తామన్నారు. ఈ పోటీల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థులు పాల్గొనాలన్నారు.

కులగణన పక్కాగా ఉండాలి

సరుబుజ్జిలి: కులగణన సర్వే పక్కాగా నిర్వహించాలని ఎంపీడీవో పీవీ మురళీమోహన్‌కుమార్ తెలిపారు. శని వారం మండలంలోని రావివలస, పెద్దపాలెంల్లో నిర్వహి స్తున్న కులగణన సర్వేను ఆయన పరిశీలించారు.

● **ఇచ్ఛాపురం:** మునిసిపాలిటీ పరిధిలో ఇప్పటి వరకు 2,448 ఇళ్ల కులగణన సర్వే పూర్తయ్యిందని కమిషనర్ ఎన్.రమేష్ తెలిపారు శనివారం సచివాలయ ఉద్యోగులు నీలపువీధిలో కులగణన సర్వే చేపట్టారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర పాల్గొన్నారు.

● **రణస్థలం:** కులగణన సర్వే పక్కాగా చేపట్టాలని చాఫ్ ప్లానింగ్ అధికారి వీఎస్ఎస్ఎల్ ప్రసన్న అన్నారు. శనివారం జేఆర్ పురం సచివాలయం-2 పరిధిలో చేపడుతున్న కులగణన సర్వే ఆమె పరిశీలించారు. సర్వే ఏ విధంగా చేపడుతున్నారో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆర్‌వీ రమణ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

నేడు జయహో బీసీ సమావేశం

సరుబుజ్జిలి: సరుబుజ్జిలిలో ఆదివారం జయహో బీసీ సమావేశం నిర్వహించనున్నట్లు టీడీపీ మండలాధ్యక్షుడు అంబళ్ల రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పదిగంటలకు జరగనున్న సమావేశానికి పార్టీ జిల్లా అధ్య క్షుడు కూన రవికుమార్ హాజరుకానున్నారని పేర్కొన్నారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

ఆమదాలవలస: పురపాలక సంఘ ప్రధాన నీటి సరఫరా కేంద్రం అలమాజీపేట వద్ద విద్యుత్ స్తంభాల నిర్వహణలో భాగంగా ఆదివారం మధ్యాహ్నం మెట్టక్కివలస ప్రాం తాలకు తాగునీటి సరఫరా జరగదని కమిషనర్ ఎం.రవి సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయంపై ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

బచ్చలవీధిలో పేరుకుపోయిన చెత్త



పొందూరు: పొందూరు పంచాయతీలోని బచ్చల వీధిలో చెత్త పేరుకుపోవడంతో స్థానికులు ఇబ్బందిపడుతున్నారు. కొద్దిరోజులుగా వీధిలో చివరలో వేసిన చెత్త తరలించకపో వడంతో కుళ్లిపోతోంది. దీంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయని పలువురు వాపోతున్నారు. చాలా మంది జ్వరాల బారిన పడి బాధపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పేరుకుపోయిన చెత్తను తొలగించాలని ఆ వీధివాసులు కోరుతున్నారు.

బెంతు ఒరియాల నిరసన

కవిటి: తమ సమస్యలు పరి ష్కరించాలని బెంతు ఒరియాలు కవిటిలో చేపట్టిన దీక్షలు శనివారా నికి 24వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా మజ్జిపుట్టుగ గ్రామానికి చెందిన పెద్దలు, విద్యార్థులు దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కుల ధ్రువ పత్రాలు లేకపోవడంతో తమ పిల్లలు, విద్యా ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.